ప్రజాశక్తి

గురువారం 25 మే 2023

5

పార్వతీపురం మన్యం

చర్చలకు భిన్నంగా బదిలీ ఉత్తర్వులు

కలెక్టరేట్ : ఉపాధ్యాయుల బదిలీల కోసం ఇచ్చిన జిఒ 47 చాలా అసంబద్ధంగా ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళిమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుశాఖ మంత్రి, అధికారులు, సంఘాల చర్చలతో నిర్ణయానికి భిన్నంగా జిఒ విడుదల చేశారని తెలిపారు. ఇది లాంగ్ స్టాండింగ్ కటాఫ్ తేది మే 31 అని నిర్ణయించి, జిఒలో నవంబరు 2023 అని ఇచ్చారని చెప్పారు. ప్రమోషన్ల సంబంధించి ఆఫ్‌లైన్‌లో కౌన్సిలింగ్ జరుపుతామని చెప్పి దీనికి భిన్నంగా ఆ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా రూ.2500 అలవెన్సుతో గతంలో ప్రమోషన్లు ఇచ్చారని, ఇపుడు అవి ప్రమోషన్లు కావనడంతో రద్దు చేసినట్లు చెబుతున్నారని వివరించారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అలవెన్స్ చెల్లంచకుండా వెట్టి చాకిరి చేయించుకుని ప్రమోషన్లు రద్దయ్యాయంటూ చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రాంతాలను బ్లాక్ చేయడం వల్ల ఖాళీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని, ఉపాధ్యాయులు 3, 4 కేటగిరీలకు వెళ్లే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గ్రూపుల కుంపటి ఆర్పుతారా?

- సంధ్యా'రాణి వాసం' పై వ్యతిరేక గ్రూపు గుర్రు
- అభ్యర్థి మార్పుపైనా చర్చ
- నేడు టిడిపి మినీమహానాడు

సాలూరు నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపుల కుంపటి రోజురోజుకూ రాజుకుంటోంది. పార్టీ నాయకత్వం ఆర్పే ప్రయత్నం చేస్తుందా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి సొంత కూటమి నిర్మాణంలో భాగంగా పావులు కదుపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీని కోసం తన వ్యతిరేక గ్రూపు నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తనను వ్యతిరేకించే, ప్రశ్నించే నాయకులు రాజకీయంగా ఎంత శక్తివంతులైనా పక్కన పెట్టాలనే ఆలోచనలో ఆమె ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రజాశక్తి-సాలూరు

మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌ని కలుపుకుని వెళుతున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి పైకి సంకేతాలిస్తూ తనకు తోచిన నిర్ణయాలనే అమలు చేయడం, సీనియర్ నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యత లేకపోవడంతో గ్రూపుల కుంపటి రాజుకుంటూ వస్తోంది. మరో ఆరు నెలల్లో ఎన్నికలకు సిద్ధం కావాల్సిన తరుణంలో ప్రతిపక్ష పార్టీలో తాజా పరిణామాలు క్రియాశీల కార్యకర్తలను కలవరపెడుతున్నాయి. ఒకవైపు అధికారపార్టీ వైఫల్యాలను సమర్థవంతంగా తిప్పి కొట్టలేక, సొంత పార్టీలో గ్రూపు రాజకీయాలపై నోరు మెదపలేక పార్టీ శ్రేణుల్లో నిరాశ నిస్పృహలు అలుముకుంటున్నాయి. అందరు నాయకులను కలుపుకుని వెళ్ళాలనే అగ్రనాయకుల సూచనలను పక్కన పెడుతూ సొంత అజెండాతో ముందుకు వెళ్తుండడంపై సంధ్యారాణి, భంజ్ దేవ్ మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది.

ఆర్‌పి భంజ్‌దేవ్

జి.సంధ్యారాణి

కొత్త అభ్యర్థి అయితే ఎలా?

రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా కొత్త వ్యక్తిని రంగంలోకి దించితే ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. దీనిపై పార్టీ అధిష్టానం కూడా రహస్య సర్వే నిర్వహించినట్లు సమాచారం. నియోజకవర్గంలో సంధ్యారాణి, భంజ్‌దేవ్ గ్రూపుల మధ్య నలిగిపోతున్న సామాన్య కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయాలను తెలుసుకుని అధిష్టానానికి నివేదిక అందించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త అభ్యర్థి వస్తారనే ప్రచారం ఊపందుకుంది. సంధ్యారాణి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న నాయకులంతా ప్రత్యామ్నాయ అభ్యర్థిని సూచిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగా మక్కువ మండలానికి చెందిన ఒక గిరిజన ఉపాధ్యాయుడు, సహకార శాఖలో పనిచేస్తున్న మరో గిరిజన అధికారి టిడిపి టిక్కెట్ రేసులో ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

పతాక స్థాయికి పోరు

నియోజకవర్గ టిడిపిలో గత కొంతకాలంగా గ్రూపు రాజకీయాలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో రాజుకుంటున్న గ్రూపుల కుంపటిని అధిష్టానం ఆర్పుతుందా? లేదా అనే అంశం చర్చనీయాంశమైంది. అధికారపార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ దానిని సొమ్ము చేసుకోవడంలో నియోజకవర్గ నాయకత్వం విఫలమయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజా పరిస్థితుల్లో గురువారం పట్టణంలో అరకు పార్లమెంటు స్థాయిలో మినీమహానాడు నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారనే ప్రచారం సాగుతోంది. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిస్థితి చర్చకు వచ్చే అవకాశం ఉంది. నియోజకవర్గ నాయకత్వంపై అసంతృప్తితో రగిలిపోతున్న గ్రూపు నాయకులు తమ గోడు చెప్పుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో అగ్రనాయకత్వం మినీమహానాడులో గ్రూపుల కుంపటిని ఆర్పే ప్రయత్నం చేస్తుందని టిడిపి కార్యకర్తలు, అభిమానులు ఎదురుచూస్తున్నారు.

విభేదాలకు కారణాలు కొన్ని..

- టిడిపి పాచిపెంట మండల అధ్యక్షులుగా ఉన్న మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్‌బాబు స్థానంలో తన అనుచరుడైన ముఖి సూర్యనారాయణకి మండల బాధ్యతలు అప్పగించారు. దీంతో సంధ్యారాణి, భంజ్‌దేవ్ మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. తన ప్రధాన అనుచరుడైన పిన్నింటి ప్రసాద్‌బాబును తనకు చెప్పకుండా అనూహ్య రీతిలో మండల అధ్యక్షుడిగా తప్పించడాన్ని భంజ్‌దేవ్ జీర్ణించుకోలేక పోతున్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి మండలంలో పార్టీకి పెద్దదిక్కుగా పిన్నింటి కుటుంబం ఉంటోంది. మండలంలో మెజారిటీ సామాజిక తరగతికి చెందిన పిన్నింటి ప్రసాద్‌బాబు, ఆయన తండ్రి పిన్నింటి ఈశ్వరరావు నాయకత్వాన్ని విస్మరించడంపై నియోజకవర్గ పార్టీ నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
- మక్కువ మండలంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావును కలుపుకుని వెళ్లకపోవడం కూడా పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది. పెంట తిరుపతిరావు బిజెపికి రాజీనామా చేసి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన చేరికను నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి తీవ్రంగా ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది.
- సాలూరు మున్సిపాలిటీలో కూడా మాజీ చైర్‌పర్సన్ గొర్లి విజయకుమారి, ఆమె భర్త మధుసూదనరావు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సంధ్యారాణి ఏకపక్ష ధోరణి నచ్చకపోవడం వల్లే వారు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.



జగనన్న విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

17,903 మందికి విద్యాదీవెన

విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.12.90 కోట్లు జమ

ప్రజాశక్తి-కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన పథకం కింద 2022-23 త్రైమాసికానికి గాను 17,903 మంది విద్యార్థులకు సుమారు 12.90 కోట్ల రూపాయల చెక్కును జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అందజేశారు. బుధవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి.. జగనన్న విద్యా దీవెన పథకం నిధులను బటన్ నొక్కి విడుదల చేశారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థుల చదువుకు అయ్యే పూర్తి ఖర్చు, ఫీజులు ప్రభుత్వమే భరిస్తుంది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్ర స్థాయిలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానం సాధించిందన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని మంచి ఉపాధి పొందాలన్నారు. ప్రతి పేద విద్యార్థికి చదువుకునే అవకాశం కల్పించాలని, ఫీజులు చెల్లించలేని కారణంగా చదువులు ఆగకూడదని రాష్ట్ర ప్రభుత్వం విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. విద్యార్థుల ఫీజులను నేరుగా వారి తల్లుల ఖాతాల్లో జమచేస్తున్నారని తెలిపారు. విద్యకలిగిన సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్, ఇన్‌ఛార్జి బిసి వెల్ఫేర్ అధికారి ఎస్.సాంబయ్య, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు బి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

16, 17న గిరిజన సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జూన్ 16, 17 తేదీల్లో జరిగే గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కోలక అవినాష్ కోరారు. మండలంలోని దుడ్డుఖల్లు గ్రామంలో జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. గిరిజన హక్కులు, చట్టాల కోసం ప్రతిఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పువ్వల సన్యాసిరావు, నాయకులు వెంకట్రావు, పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరడంతో పరిపూర్ణ గ్రామ స్వరాజ్యం సాకారమైందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం మండలంలోని సంఘంవలసలో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు గ్రామస్థాయిలో ప్రజల ముంగిటికే ప్రభుత్వ పాలన తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి ఎం.శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాథరావు, ఎఎంసి చైర్ పర్సన్ మరడాన భాగ్యశ్రీ, వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, సీనియర్ నాయకులు భీమవరం కృష్ణమూర్తి, గంట రామకృష్ణ, యాల్ల ప్రతాప్, వి.గురురాజు, సర్పంచ్ బడే శ్రీరంజన్ పాల్గొన్నారు.

మక్కువ మండలంఓ విరిగిపడిన విద్యుత్తు స్తంభాలు

ఈదురుగాలుల బీభత్సం

ప్రజాశక్తి-మక్కువ,సాలూరురూరల్

జిల్లాలో బుధవారం పలు చోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మక్కువ, సాలూరు మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల వల్ల పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల స్తంభాలు విరిగిపోయాయి. మక్కువ మండలంలో తెగి పడిన విద్యుత్ వైర్లను, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేసేందుకు సిబ్బంది అంచనా వేస్తున్నారు. మరమ్మతులు చేసి అవకాశం ఉన్న గ్రామాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడానికి ఎఇ పోలాకి శాంతారాం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారురు. డబ్బగెడ్డలో చెట్లు విరిగి కరెంటు తీగలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది.

సీతానగరం : మండలంలో బుధవారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. మరోవైపు ఈదురుగాలులు భయాందోళన కలిగించాయి. బుధవారం మధ్యాహ్నం వరకు ఎండలు తీవ్రస్థాయిలో ఉండడం ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. మూడు గంటలకే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో ప్రజలు ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందారు.

సీతంపేట : సీతంపేట మన్యంలో బుధవారం కుండపోతగా వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.272 అందేలా 'ఉపాధి' కల్పించాలి

ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఉపాధిహామీలో వేతనదారులకు పూర్తి వేతనం రూ.272 అందేలా పనులు కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటిడిఎలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో ఉండాలన్నారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టా ఉన్న లబ్ధిదారులకు 150 రోజులు పని కల్పించాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో జాబ్‌కార్డులు డిలీట్ అయ్యాయని ఫిర్యాదు చేస్తున్నారని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిఒక్కరికీ జాబ్ కార్డ్ ఉండాలని స్పష్టంచేశారు. వర్షాకాలంలో కూడా అందుకు తగ్గ పనులను గుర్తించాలన్నారు. చేపట్టిన పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి శ్రీహరి, ఎపిఒలు బాబూరావు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

మర్రిపాడు నుండి రేగులగూడ, ద్వారబందం వరకు నిర్మించే రోడ్డును ఐటిడిఎ పిఒ కల్పనకుమారి.. డిఎఫ్ఒ ప్రసూనతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు తీసుకొని వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలన్నారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఫారెస్ట్ అనుమతులకు సంబంధించిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డిఎఫ్ఒకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఇఇ రాధారాణి, ఫారెస్ట్ అధికారి హరి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా రహదారి నిర్మించాల్సిన మార్గాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

90 మందికి ఉద్యోగాలు

సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో ఇటీవల జాన్సన్ లిఫ్ట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 90 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఐటిడిఎ పిఒ కల్పనకుమారి నియామక పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన యువతను అభినందించారు. కొద్దిసేపు వారితో ముచ్చటించారు. వివిధ రకాల ప్రశ్నలు వేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.వి.గిరి, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో స్కానింగ్ కేంద్రాలను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో ఉన్న మాన్యశ్రీ డయాగ్నోస్టిక్స్, శ్రీ సాయిరాం మెడికల్ డయాగ్నోస్టిక్స్ స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులను, స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్కానింగ్, ఇతర స్కానింగ్‌లకు వేర్వేరుగా రికార్డులు ఉండాలన్నారు. వివరాలు స్పష్టంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. స్కానింగ్ చేసే తేదీలు, రిఫర్ చేస్తున్న వైద్యుల వివరాలు నమోదు చేయాలన్నారు. స్కానింగ్ చేసిన జాబితాను ప్రతి నెలా విధిగా వైద్య ఆరోగ్య కార్యాలయానికి పంపాలన్నారు. స్కానింగ్ పూర్తయిన కొంత మంది వివరాలను రికార్డులో పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్కానింగ్ యంత్రాలను, రిజిస్ట్రేషన్ రెన్యువల్ గడువు తేదీలను ఆయన పరిశీలించారు. అనంతరం లింగ నిర్ధారణ నిషిద్ధ చట్టం అవగాహన పోస్టర్లను పరిశీలించి, స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షల సమాచారం తెలిస్తే 104 టోల్ ఫ్రీ నంబరు కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమోలు వి.సన్యాసిరావు, వై.యోగీశ్వర రెడ్డి, సూపర్ వైజర్ జయగౌడ్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

స్నేహితురాలే చంపేసింది

- ప్రియుడితో కలిసి హత్య
- ఆర్థిక లావాదేవీలే కారణం
- విఒఎ హత్యకేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన గోకాడ మహేశ్వరి (28) ఈనెల 18న హత్యకు గురైన విషయం తెలిసిందే. గేదెలవానిపాలెం రహదారిలో గల చిలకవాని చెరువు వద్ద తుప్పలలో ఆమె మృతదేహం లభించడంతో పోలీసులు హత్యకేసుగా నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు హత్య కేసును ఛేదించారు. హత్యకు పాల్పడిన నిందితులను బుధవారం మీడియా ముందు హాజరు పరిచారు. విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం...

కల్లేపల్లి గ్రామ పంచాయతీలో గోకాడ మహేశ్వరి, గాడి చిన్నతల్లి ఇద్దరూ వెలుగు బుక్ కీపర్లుగా (విఒఎ) విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ మంచి స్నేహితులు. చిన్నతల్లి తన విధినిర్వహణలో బ్యాంకు రుణాల లావాదేవీలకు సంబంధించి అక్రమాలకు పాల్పడింది. అంతేకాకుండా మహేశ్వరి వద్ద కొంత నగదును అప్పుగా తీసుకుంది. తనకు రావలసిన అప్పు విషయంలో వీరి మధ్య ఇటీవల మనస్పర్థలు తలెత్తాయి. ఇదిలా ఉండగా ఈనెల 17న బుక్ కీపర్లకు జిల్లా కేంద్రంలో రెండు రోజుల సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. తాను చేసిన అక్రమాలను ఆ సమావేశంలో అధికారులకు చెబుతాదేమోనని భావించిన చిన్నతల్లి... మహేశ్వరిని చంపేందుకు తన ప్రియుడు డెంకాడ వాసుతో కలిసి పన్నాగం పన్నింది. సమావేశానికి వెళ్తున్నామని నమ్మబలికి ప్రియుడి కారులో మహేశ్వరిని ఎక్కించుకుని భీమసింగ్ ఆర్ఒబి కింద రోడ్డు వద్దకు చేరుకున్నారు. కారు వెనుక సీటులో కూర్చున్న మహేశ్వరి చేతులను చిన్నతల్లి గట్టిగా పట్టుకోవడంతో ఆమె ప్రియుడు వాసు చున్నీని మహేశ్వరి పీకకు గట్టిగా బిగించాడు. దీంతో మహేశ్వరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య జరిగిన అనంతరం అక్కడనుండి చిన్నతల్లి జిల్లా సమావేశానికి వెళ్లగా.. మహేశ్వరి మృతదేహాన్ని కారులో గేదెలవానిపాలెం రహదారిలో గల చిలకవాని చెరువు వద్దకు వాసు తీసుకొచ్చి తుప్పల్లో పడేశాడు. హత్య కేసును వివిధ కోణాలలో పోలీసులు విచారించడంతో భయభ్రాంతులకు గురైన హంతకులు దూర ప్రాంతాలకు పోయి జీవించాలనుకున్నారు. పోలీసుల నుండి వీరు తప్పించుకోవడానికి అదే గ్రామానికి చెందిన కోరాడ సాయికుమార్‌ను సాయం కోరడంతో వీరు ముగ్గురు గ్రామాన్ని విడిచి వెళ్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. గంగుబూడి ప్రాంతం వద్ద పోలీసులు ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించారు. హంతకులిద్దరూ తెప్పించు కోవడానికి సహకరించిన సాయికుమార్‌ను ఎ3 ఛార్జి షీటులో చేర్చారు. ఈ హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్.కోట సిఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎల్.కోట ఎస్ఐ ఎం.గోవిందరావు, కానిస్టేబుళ్లు ఎం.పోతురాజు, ఎ.రమేష్ కుమార్‌లను డిఎస్‌పి గోవిందరావుతో పాటు జిల్లా ఎస్‌పి ఎం.దీపిక అభినందించారు. సమావేశంలో వేపాడ ఎస్ఐ కె.రమేష్, ఎల్ కోట ఎఎస్ఐలు యువరాజు, గోవిందరావు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమల్లో విజయనగరం జిల్లా సరికొత్త రికార్డును సృష్టించింది. పనిదినాల కల్పనలో దేశంలోనే మన జిల్లా నెంబరు 1గా నిలిచింది. పనిదినాల కల్పనకు సంబంధించి ఏప్రెల్, మే నెలలకు కలిపి 90లక్షల 3వేల పనిదినాలను కల్పించాల్సి ఉండగా, మే 23 నాటికి 73లక్షల 28వేల పనిదినాలను కల్పించడం ద్వారా, ఇచ్చిన లక్ష్యంలో 81.40 శాతం సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. గ్రామీణ ఉపాధిహామీ అమల్లో మన రాష్ట్రం ఇప్పటికే దేశంలోనే మొదటి స్థానంలో కొనసాగుతుండగా, రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాలు దేశంలోనే వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. నాల్గవ స్థానంలో రాజస్థాన్‌లోని బన్‌స్వారా జిల్లా, ఐదో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లాలు నిలిచాయి.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి కల్పనలో 1 విజయనగరం

రోజుకు రెండున్నర లక్షలమందికి పని ● ఐదో స్థానం పార్వతీపురం మన్యం జిల్లా

కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నిరంతర పర్యవేక్షణ కారణంగా, ఉపాధి పని దినాల కల్పనలో విజయనగరం జిల్లా దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఆమె స్వయంగా గ్రామాల్లో పర్యటిస్తూ, ఉపాధి పనులను తనిఖీ చేస్తున్నారు. శాఖాపరంగా కూడా నిత్యం పర్యవేక్షిస్తూ, లక్ష్యాల సాధన కోసం ఉపాధి హామీ అధికారులను, సిబ్బందిని పరుగులు పెట్టిస్తుండటంతో మన జిల్లా ఈ అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ ఘనత సాధించినందుకు వేతన దారులను, ఉపాధిహామీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధిహామీ చట్టం 2005లో ప్రారంభమైనప్పటినుంచీ అమలులో విజయనగరం జిల్లా ముందంజలో ఉంటోంది. జిల్లాలో వలసల నివారణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ పథకం ఆలంబనగా నిలిచింది. ప్రస్తుతం రోజుకు సుమారు రెండున్నర లక్షలమందికి పని కల్పిస్తున్నారు. జిల్లాలో సుమారు 3,82,000 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 6,07,000 మంది వేతనదారులు నమోదై ఉన్నారు. ఎస్‌సిల జాబ్ కార్డులు 44,301, ఎస్‌టిల జాబ్ కార్డులు 9,937 ఉండగా, ఎస్‌సి, ఎస్‌టిలకు పని దినాల కల్పనలో కూడా విజయనగరం జిల్లా కొత్త రికార్డును సృష్టించింది. ఎస్‌సి జాబ్‌కార్డుదారుల్లో 31,724 కుటుంబాలు (71.61శాతం), ఎస్‌టి కుటుంబాలు 6,784 (68.2శాతం) పని కల్పించి, ఉపాధి పనుల్లో వీరి భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచడం ద్వారా మన జిల్లా అగ్రస్థానాన్ని సాధించింది. గతంలో ఉపాధి పనులకు వచ్చే ఎస్‌సి, ఎస్‌టిల సంఖ్య 20శాతం కూడా ఉండేదికాదు. వీరిలో చాలామంది పనులకోసం ఇతర ప్రాంతాలకు వలస పోవడం, భవన నిర్మాణం, ఇతరత్రా పనుల్లో పాల్గొనడం జరిగేది. ఇటీవల ఉపాధి పనులకు వచ్చే ఎస్‌సి, ఎస్‌టిల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. ఒబిసిలకు సంబంధించి 3,27,104 జాబ్ కార్డులు ఉండగా, సుమారుగా 2,42,720 కుటుంబాలు ఉపాధి పనులకు హాజరవుతున్నాయి.

ఎన్ఎంఎంఎస్‌లో శతశాతం మస్తర్ల నమోదు

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టమ్) యాప్ లో వేతనదారులకు శతశాతం మస్తర్లను నమోదు చేయడం ద్వారా, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. జిల్లాలో సగటున 73.75 శాతం వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికీ 100 రోజులపాటు పని కల్పిస్తున్నారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు కలిగిన ఎస్‌టి కుటుంబాలకు మాత్రం 150 రోజులవరకు పని కల్పిస్తున్నారు. జిల్లాలో రెండుపూటలా పనులు చేయడం ద్వారా, సగటు వేతనం రూ.244 కు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.172.2 కోట్ల విలువైన ఉపాధి పనులు జరగ్గా, ఇప్పటివరకు రూ.170 కోట్లను వేతనదారులకు చెల్లించడం జరిగింది.

వేతనదారులకు, సిబ్బందికి అభినందనలు

పనిదినాల కల్పనలో దేశంలోనే మన జిల్లా మొదటి స్థానం సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉంది. ఇందుకు డ్వామా సిబ్బందికి, వేతనదారులు కూడా అభినందనలు. జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశం, ప్రజాప్రతినిధులు తోడ్పాటు, డ్వామా సిబ్బంది కృషితో బాటు, ఉపాధి పనులపట్ల వేతనదారుల్లో ఉన్న నమ్మకం కూడా దీనికి కారణంగా భావిస్తున్నాను. ఇదే స్ఫూర్తితో మరిన్నిలక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరుతున్నాను.

- ఉమా పరమేశ్వరి,
డ్వామా పీడీ , విజయనగరం జిల్లా

రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పిహెచ్‌సిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేవారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రి సిబ్బంది పనితీరు గురించి వైద్యాధికారి రెడ్డి శంకరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో ప్రసూతిగదిని పరిశీలించారు. ప్రసూతి గది ఇలాగే ఉంటుందా? అని కలెక్టర్ ప్రశ్నించారు. డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు స్పందిస్తూ సువర్ణముఖి నది తీరాన పిహెచ్‌సి ఉండటంతో హుదూద్ తుపాను సమయంలో ఆస్పత్రి మొత్తం మునిగిపోయిందన్నారు. చాలా వరకు ఆసుపత్రి గదులు పాడైపోయాయని, అప్పుడు కొంతవరకు వాటికి మరమ్మతులు చేశారని తెలిపారు.

తుపాను వల్ల మరోసారి ఆస్పత్రిలో సుమారు వారం పాటు నీరు నిలిచిపోయిందన్నారు. దీంతో రికార్డులు, కంప్యూటర్లు, బెడ్లు పాడైపోయాయని వివరించారు. అనంతరం ఆసుపత్రి పక్కనే నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలం రాకముందే నూతన భవనం అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.రామస్వామి, ఇఒ తిరుపతిరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో శివ్వాలవీధికి చెందిన మజ్జి తులసీదాస్ కుమారుడు ప్రణయ (5) అనారోగ్యంతో బాధపడుతూ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్షణరావు బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలుగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, కర్రి శ్రీనివాసరావు, చిలకలపల్లి వెంకటరావు , మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, ఎస్.వెంకటరావు , మిన్న పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతి అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

సమస్యలపై గ్రీన్‌అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-బలిజిపేట

ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్‌అంబాసిడర్లు ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ భానుమూర్తికి వినతి అందించారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షులు శ్రీను మాట్లాడుతూ 9 నుంచి 15 నెలల వరకు జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబాలతో పస్తులు ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనులకు రానీయడం లేదని, ఇంకొక పనికి వెళ్లలేకపోతున్నామని వాపోయారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పాణాలను కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం 'జగనన్నే మా నమ్మకం' అంటూ చెబుతుందని, అటువంటి నమ్మకాన్ని గ్రీన్‌అంబాసిడర్లకు కలిగించడం లేదని తెలిపారు. వెంటనే గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ భానుమూర్తి స్పందిస్తూ ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు, ఫకీరు, మరియమ్మ, దాసు, ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

'కనిపించిన దేవుడు అంబేద్కర్' గీతావిష్కరణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కేదారిపురం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్.హరిగోపాల్ రచించిన కనిపించిన దేవుడు అంబేద్కర్ అనే గీతాన్ని ప్రముఖ గేయ రచయిత పాలక దేవానంద్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన పాటను ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిగోపాల్ ఉపాధ్యాయ వృత్తితోపాటు అభ్యుదయ గేయాలు రచించడంలో మంచి ప్రావీణ్యం సంపాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా ఎడి వెంకటేశ్వరరావు, టిక్కబాయి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రకాష్, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, అమర్నాథ్, గౌరీ శంకర్రావు పాల్గొన్నారు.

కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న డివిజనల్ యాంకర్ యశోదమ్మ

రూ.50 ఖర్చుతో పురుగులమందు

ప్రజాశక్తి-పాచిపెంట

కేవలం 50 రూపాయల ఖర్చుతో ఎకరానికి అన్ని పంటలపై పనిచేసే పురుగుమందును రైతులు ఇంటి వద్ద తయారు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. రైతులకు ప్రకృతి సేద్యంపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. మండలంలోని పి.కోనవలస ఐసిఆర్‌పి కుమార్ తయారుచేసిన పంచపత్ర కషాయం 40 రోజుల తర్వాత మాత్రమే అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇప్పటినుండే తయారు చేసుకుంటే రసాయన పురుగు మందులపై ఖర్చును తగ్గించవచ్చన్నారు. దీనిని ఆరు నెలల పాటు నిల్వచేసి వాడుకోవచ్చన్నారు. డివిజనల్ యాంకర్ యశోదమ్మ మాట్లాడుతూ కషాయం తయారీ విధానాన్ని వివరించారు. ఎంసిఆర్‌పి బాలకృష్ణ, ఐసిఆర్‌పి విజయ్, రైతు తిరుపతిరావు పాల్గొన్నారు.

మస్తర్ల పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని గాజులవలస గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల మస్తర్లను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు నిర్ణీత సమయంలో వచ్చి కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. అప్పుడు కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు.

మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

మన్యంలో సబ్‌కలెక్టర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మన్యంలో సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంఇఒ సత్యనారాయణతో మాట్లాడి, ఇంతవరకు వచ్చిన స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి సక్రమంగా విద్యా కానుక కిట్లు అందేలా చూడాలని సూచించారు. అనంతరం మొండెంఖల్ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని పరిశీలించి సచివాలయ సిబ్బందిని వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బి.నాగేశ్వరరావు, ఆర్ఐ పిఎల్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం : రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు అందరికీ సకాలంలో పాఠ్యపుస్తకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. మండలంలోని గుమ్మలక్ష్మీపురం ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలను, జెవికె కిట్లను పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి మరో 15 రోజులు గడువున్న నేపథ్యంలో సామగ్రి పాడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వచ్చిన పాఠ్యాంశాల పుస్తకాలలో ఏమైనా కొత్తగా ఉన్నవి, లేనివి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సామగ్రి పంపిణీలో తేడాలు వస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, సిఆర్‌పిలు ఉన్నారు.

కురుపాంలో జెవికె కిట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని 24వ వార్డు ఎరుకలి వీధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మైసర్ల పైడియ్య కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద పదివేల రూపాయలు ఆర్థిక సాయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వార్డు ఇన్‌ఛార్జి బీసపు బాలకృష్ణ అందజేశారు. పైడియ్య దహన సంస్కారాల నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. కార్యక్రమంలో 26వ వార్డు ఇన్‌ఛార్జి కర్రి అప్పలస్వామి, 14వ వార్డు కౌన్సిలర్ పి.మధుసూదనరావు పాల్గొన్నారు.

షూటింగ్ సందడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చలనచిత్ర నటులు సంపూర్ణనేష్ బాబు, అంతార జంటగా నటిస్తున్న చిత్రం షూటింగ్ బుధవారం విజయనగరంలో జరిగింది. ఒక మాతృమూర్తి విషాద జీవిత సంఘటన నేపథ్యంతో రూపొందించబడిన కథతో ప్రముఖ చిత్ర దర్శకులు పంపాన వెంకట్ దర్శకత్వంలో ప్రొడక్షన్ నెంబర్ చిత్రంగా నిర్మాత రాజ్ కుమార్ ఆధ్వర్యాన జరిగింది. సెంటిమెంట్.. మెలోడి... వివిధ అంశాలతో కూడుకున్న ఈ చిత్రంలో ఐదు పాటలు ప్రేక్షకులను అలరించనున్నాయి.

విద్యాకానుక కిట్ల పరిశీలన

పాచిపెంట.. పుస్తకాలను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంటలోని ఎడ్లవీధి పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ కుమార్ పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీకి సిద్ధంగా ఉంచాలని ఎంఇఒ పి.జోగారావు, సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ పాయింట్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను సక్రమంగా పొందిపరిచి ఉంచడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.

సీతంపేట : విద్యార్థులకు పుస్తకాలు సకాలంలో పంపిణీ చేయాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సీతంపేట ఎంఆర్‌సిని పరిశీలించారు. పుస్తకాలు ఎన్ని వచ్చాయి, ఇంకా ఎన్ని రావాల్సి ఉందని ఎంఇఒ ఆనందరావును ప్రశ్నించారు. అనంతరం ఎంఇఒ, హెచ్ఎంలు, సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ప్రారంభం నాటికి నాడు- నేడు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉండేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. మిగతా పుస్తకాలు కూడా రప్పించుకోవాలన్నారు.

సాయినగర్ కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి జి.ప్రదీప్ కుమార్ జ్వర పీడితులు, పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నవోనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఎంఎల్‌హెచ్‌పి జ్ఞాన భార్గవి, ఎఎన్ఎం ఉష పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై చొరవ చూపాలి

ప్రజాశక్తి - కురుపాం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కాపు శంకరరావు అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల మండల అధ్యక్షులు కె.నాగేంద్ర సాయి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు నానాటికి అధికమవుతున్నాయి తప్ప పరిష్కారం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎపిజిఇఎకు సంబంధించి 160 సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు శంకరరావు

నేరాలు ఘోరాలు

గిరిజన విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-పాచిపెంట

పరీక్ష తప్పాననే మనస్తాపంతో పురుగుల మందు తాగి గిరిజన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని అమ్మవలసలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమ్మవలస గ్రామానికి చెందిన జట్ల హేమంత్‌కుమార్ (17) సాలూరులో అగ్రికల్చర్ డిప్లొమో కళాశాలలో చదువుతున్నాడు. నెల క్రితం విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయినట్లు తెలిసినా ఇంటిదగ్గర చెప్పకుండా గుట్టుగా ఉన్నాడు. ఈ విషయం మంగళవారం హేమంత్ తల్లిదండ్రులకు తెలిసిపోయింది. దీంతో మనస్తాపానికి గురై ఆరోజు సాయంత్రం పురుగుల మందు తాగాడు. అనంతరం సమీపంలోని చెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్లి అక్కడ పడిపోయాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే సాలూరులోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విజయనగరం తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం హేమంత్ మరణించాడు. తండ్రి రాము ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని పోస్టాఫీసు బస్టాప్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన కారెడ్ల చినతల్లి సాలూరు నుంచి పార్వతీపురం వెళ్లడానికి పోస్టాఫీసు బస్టాప్ వద్ద నిరీక్షిస్తోంది. సాలూరు డిపోకి చెందిన పార్వతీపురం వెళ్లే బస్సు రాగానే ఆమె ఎక్కడానికి ప్రయత్నం చేసింది. బస్సు డ్రైవర్ పి.మురళి నిర్లక్ష్యం వల్ల వృద్ధురాలు చినతల్లి కాళ్ల మీదుగా బస్సు వెనుక టైర్లు వెళ్లిపోయాయి. ఆమె కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. టౌన్ ఎస్ఐ నారాయణ రావు కేసు నమోదు చేశారు.

పాలనలో మార్పునకు వాలంటీర్లే సాక్ష్యం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వైసిపి పాలనలో సమూల మార్పులకు ప్రత్యక్ష సాక్ష్యం వాలంటీర్ల వ్యవస్థేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం బెలగాం ప్రాంతంలోని 7, 8, 9, 10, 11 వార్డు సచివాలయాలకు సంబంధించి విశేష సేవలు అందిస్తున్న వాలంటీర్లకు పట్టణంలోని లయన్స్ కల్యాణ వేదిక వద్ద పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వమే వాలంటీర్‌గా ప్రజల ముందుకు వచ్చి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, కమిషనర్ రామ అప్పలనాయుడు పాల్గొన్నారు.

కురుపాం : సంక్షేమ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందించడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయం వద్ద ఎంపిడిఒ వి.వి. శివరామప్ప ఆధ్వర్యంలో బుధవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి నేరుగా సమస్యలు తెలుసుకొని పరిష్కరించే చక్కటి అవకాశం వాలంటీర్లకు దక్కిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సక్రమంగా పని పనిచేయాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లి సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయచంద్రశేఖర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసిలు వి.బంగారనాయుడు, టివిఎస్ స్వామి యోజులు, జి.సంతోషిని, మేజర్ పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కురుపాం.. వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి